# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 11-04-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోర్చుగల్, స్లోవేకియా దేశాల పర్యటనను పూర్తి చేసుకొని ఈరోజు న్యూఢిల్లీకి తిరిగి పయనమయ్యారు.
- ❖ వారణాసిలో 3 వేల 884 కోట్ల రూపాయల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభోత్సవాలు చేశారు.
- ❖ దేశాభివృద్ధిలో సాంకేతికత అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు.
- ❖ దేశంలో వివిధ రాష్ట్రాలలో రానున్న 3, 4 రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐ.ఎం.డి.) వెల్లడించింది.

==========================

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పోర్చుగల్, స్లోవేకియా దేశాల పర్యటనను పూర్తి చేసుకొని ఈరోజు న్యూఢిల్లీకి తిరిగి పయనమయ్యారు. ఇదిలా ఉండగా ప్రజాసేవా రంగంలో విశిష్ట సేవలకుగానూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము స్లోవేకియాలోని 'కాన్‌స్టాంటిన్ ది ఫిలాసఫర్ యూనివర్సిటీ' నుంచి గౌరవ డాక్టరేట్ స్వీకరించారు. పాలన, సామాజిక న్యాయం, సమ్మిళిత వృద్ధి కోసం ఆమె అందిస్తున్న సేవలకు గుర్తింపుగా దీనిని ప్రదానం చేస్తున్నట్లు విశ్వవిద్యాలయం పేర్కొంది. విద్య, మహిళా సాధికారత, సాంస్కృతిక భాషా వైవిధ్యాలను పరిరక్షించి ప్రోత్సహించడానికి ఆమె అవిరళ కృషి చేస్తున్నారని ప్రశంసించింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ... 140 కోట్ల మంది భారతీయుల తరఫున తాను దీనిని స్వీకరిస్తున్నానన్నారు. వ్యక్తిగత సాధికారతకే కాకుండా దేశాభివృద్ధికి విద్య ఒక సాధనమని రాష్ట్రపతి పేర్కొన్నారు.

==========================

మహాత్మా జ్యోతి రావ్ ఫూలే జయంతి సందర్భంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆయనకు నివాళులర్పించారు. మహాత్మా జ్యోతి రావ్ ఫూలే మానవాళికి నిజమైన సేవకుడని పేర్కొన్నారు. ఫూలే సమాజంలోని అణగారిన వర్గాల సంక్షేమం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. దేశానికి ఆయన చేసిన అమూల్యమైన సేవలు ప్రతి తరానికి స్ఫూర్తినిస్తూనే ఉంటాయని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

==========================

భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండు అంశాలతో ముందుకు వెళుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. వారణాసిలోని మెహదీగంజ్‌లో 3 వేల 884 కోట్ల రూపాయల విలువైన 44 ప్రాజెక్టులకు ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ... కాశీ నగరం వేగవంతంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ నగరం ప్రాచీనతకు చిహ్నం మాత్రమే కాదని, ప్రగతికి నమూనాగా నిలిచ్చిందని, ఇక్కడ చాలా వస్తువులకు GI ట్యాగ్ ఇవ్వబడిందన్నారు. భారతీయ ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న బ్రాండ్లుగా మారుతున్నాయని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 37 సెకన్లు)

ఈ సందర్భంగా 70 సంవత్సరాలు పైబడిన ముగ్గురు లబ్ధిదారులకు ప్రధానమంత్రి, ఆయుష్మాన్ కార్డులను అందజేశారు. అల్లాగే 3 భౌగోళిక సూచికలు (GI) కోసం సర్టిఫికెట్లను, బనారస్ డెయిరీతో అనుబంధించబడిన రాష్ట్రంలోని పాడి రైతులకు 106 కోట్ల రూపాయల బోనస్‌ను కూడా అందజేశారు.

==========================

దేశాభివృద్ధిలో సాంకేతికత అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. ఈరోజు ఢిల్లీలో జరిగిన కార్నెగీ గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృతిమ మేధ లో భారత్ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారడానికి ఆదేశ సాంకేతిక పురోగతి కారణమన్నారు. వాణిజ్యాన్ని, జాతీయ భద్రతను సాంకేతికత మరింత పటిష్టం చేస్తోందని జైశంకర్ పేర్కొంటూ...

(వాయిస్ 27 సెకన్లు)

==========================

అమెరికా ఉత్పత్తులపై సుంకాలను చైనా 125 శాతానికి పెంచింది. రేపటి నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ఆ దేశ ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దీనిని ఒక నంబర్ గేమ్‌గా అభివర్ణించిన చైనా మంత్రిత్వ శాఖ.. ఆర్థికంగా ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొంది. తమ ఉత్పత్తులపై అమెరికా టారిఫ్‌లను 145 శాతానికి పెంచినందున తాము విధించిన 84 శాతం సుంకాలను 125 శాతానికి పెంచుతూ... నిర్ణయం తీసుకున్నట్టు చైనా తెలిపింది. తమ దేశ వస్తువులపై విధించిన పరస్పర సుంకాలను తొలగించే దిశగా అమెరికా నిర్ణయం తీసుకోవాలని కోరింది.

విరామం

==========================

ఆరోగ్య సంరక్షణను ప్రభుత్వం ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకువచ్చిందని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ అన్నారు. ఫరీదాబాద్‌లోని ESIC మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ రెండవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైద్యులు మానవతా స్ఫూర్తితో పని

చేయాలని అన్నారు. భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే... దేశ పౌరులు ఆరోగ్యంగా ఉండాలని ఆయన సూచించారు.

(వాయిస్ 36 సెకన్లు)

==========================

భారత్ - ఇటలీ దేశాల  మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని వేగవంతం చేయడానికి రెండు దేశాలు కృషి చేస్తున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ అన్నారు. ఈరోజు సాయంత్రం న్యూఢిల్లీలో ఇటలీ ఉప ప్రధాన మంత్రి ఆంటోనియో టజానితో కలసి కేంద్రమంత్రి సంయుక్త విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పియూష్ గోయల్ మాట్లాడుతూ... భారత్ – ఇటలీ దేశాలు వివిధ రంగాలలో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఇరు దేశాలు కట్టుబడి ఉన్నాయన్నారు. కాగా అంతకు ముందు జరిగిన ఇండియా ఇటలీ బిజినెస్, సైన్స్ అండ్ టెక్నాలజీ ఫోరమ్‌లో కేంద్రమంత్రి పియూష్ గోయల్  పాల్గొన్నారు.

==========================

తూర్పు గాజాలోని అనేక ప్రాంతాల్లో సైనిక కార్యకలాపాలు ముమ్మరం కావడంతో అక్కడి  ప్రజలు అత్యవసరంగా ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ రక్షణ దళాలు (IDF) ఈరోజు ఉత్తర్వులు జారీ చేశాయి. పౌరులు తమ భద్రత కోసం పశ్చిమ దిశగా వెళ్లాలని IDF ప్రతినిధి అవిచాయ్ అద్రే సామాజిక మాధ్యమం వేదికగా పిలుపునిచ్చారు. ఈ ప్రాంతాల్లో ఉగ్రవాద స్థావరాలను నాశనం చేసేందుకు IDF  అన్ని విధాలా ప్రయత్నిస్తోందన్నారు. కాగా దక్షిణ గాజాలో   రఫాలోని టెల్ అల్-సుల్తాన్ శరణార్థి శిబిరంలో ఇటీవల జరిగిన దాడులలో హమాస్ ఉగ్రవాది అహ్మద్ ఇయాద్ ముహమ్మద్ ఫర్హాత్‌ను హతమార్చినట్లు  IDF ఒక ప్రకటనలో తెలిపింది.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో జమ్మూకశ్మీర్‌లో ఐక్యతా స్ఫూర్తి  పరిఢవిల్లుతోందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని తిరస్కరిస్తూ.. హురియత్ కాన్ఫరెన్స్ తో మరో అనుబంధ సంస్థ విడిపోయిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 'ఏక్ భారత్... శ్రేష్ఠ భారత్...' దార్శనికతకు ఇది విజయమని పేర్కొన్నారు. ఐక్య భారత్‌కు కట్టుబడి ఉంటామన్న  ఆ సంస్థ ప్రకటనను స్వాగతిస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. దీంతో ఇంతవరకూ వేర్పాటువాదానికి దూరంగా వెళుతూ... భారత రాజ్యాంగానికి విధేయత ప్రకటించిన హురియుత్ అనుబంధ సంస్థల సంఖ్య 12కు చేరింది అని అమిత్‌షా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు.

==========================

దేశంలో వివిధ రాష్ట్రాలలో రానున్న 3, 4 రోజుల్లో వర్షాలు కురిసే కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐ.ఎం.డి.) వెల్లడించింది. బీహార్‌లో రాబోయే 5 రోజుల్లో అనేక ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వడగళ్ల వానలు, కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐ ఎం డి వెల్లడించింది. అలాగే రాజస్థాన్, పంజాబ్, హర్యానా, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్ లలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఢిల్లీలో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని తెలియజేసింది. ఈ నెల 14వ తేదీ వరకు ఉష్ణోగ్రతలు తగ్గుతాయని ఐఎండి పేర్కొంది.

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాల్లో ముగిసాయి. సెన్సెక్స్ ఉదయం 73 వేల 847 పాయింట్ల వద్ద ప్రారంభమై... చివరికి 1,310 పాయింట్ల లాభంతో 75 వేల 157 వద్ద ముగిసింది.

===========================

===========================